సాక్షి
చిత్తూరు

మంగళవారం । 23 । జనవరి । 2024



బాబు కోసమే ఎల్లో మీడియా ఆరాటం

ఎన్నికలు సమీపిస్తున్నందున ఎల్లో మీడియా ఆగడాలు ఎక్కువయ్యాయని వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 10లో



సర్వేల పేరుతో 'పచ్చ' మాయ

సర్వేల పేరుతో మండలంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కొంతమంది ప్రజలను మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

- 10లో



మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం

బోయకొండలో జరగనున్న లక్ష కుంకుమార్చనకు రావాలి మంత్రి పెద్దిరెడ్డిని ఆలయ చైర్మన్, ఈఓ సోమవారం ఆహ్వానించారు.

- 10లో

న్యూస్‌రీల్

స్పందనపై అలసత్వం వద్దు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే ప్రతి ఫిర్యాదును విచారించాలని, ఈ విషయంలో అలసత్వం వద్దని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం చిత్తూరులోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, పోలీసు సేవలపై ప్రజలు ఏఎస్పీకి వినతులు అందజేశారు. వాటిని నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

నేడు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధుల జమ

చిత్తూరు అగ్రికల్చర్: వైఎస్సార్ ఆసరా పథకం అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసాను ఇవ్వడమే కాకుండా గుండెనిండా ఆనందాన్ని నింపింది. ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణాల మొత్తాలను పూర్తి స్థాయిలో ప్రభుత్వం జమ చేయనుంది. 2019 ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన హామీ మేరకు రుణాల మొత్తాలను దశల వారీగా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో 75 శాతం నిధులను జమ చేయగా, మిగిలిన నిధులను కూడా మంగళవారం అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ కానుంది. దీంతో డ్వాక్రా రుణాల మొత్తాలు పూర్తి స్థాయిలో మహిళల చేతికందుతుంది. మంగళవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా వర్చువల్ విధానంతో రుణాల మాఫీ మొత్తాలు అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేయనున్నారు. జిల్లాలోని డ్వాక్రా మహిళలకు 2019 ఎన్నికల సమయానికి పెండింగ్‌లో ఉండిన రుణాలు మాఫీ చేస్తామని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2019 ఏప్రిల్ 11వ తేదీకి జిల్లా వ్యాప్తంగా 33.655 సంఘాలకు చెందిన 3,10,635 మంది మహిళా సభ్యుల బ్యాంకు రుణాలు రూ.1,298.13 కోట్లను మాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దశల వారీగా ప్రతి ఏటా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాల మొత్తాలను చెల్లిస్తోంది. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ. 973.78 కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేసింది. మిగిలిన రూ. 324.35 కోట్లను నాలుగో విడతగా జిల్లాలోని మొత్తం 33,655 సంఘాలకు చెందిన 3,10,155 మందికి మాఫీ మొత్తాలను ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు తీసుకుంది. ఈ ప్రక్రియతో ఎన్నికల సమయంలో పెండింగ్‌లో ఉండిన రుణాల మొత్తాలు అక్కచెల్లెమ్మల చేతికందినట్లవుతుంది.

జగమంతా రామమయం



వి.కోట: సీతారామ ఉత్సవమూర్తుల ఊరేగింపులో భక్తుల కోలాటం ప్రదర్శన



కుప్పం: సీతారామ చిత్రపటానికి ఊరేగింపు

అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ వేళ.. రామనామ స్మరణ మార్మోగింది. ఆలయాలను విద్యుత్ దీపాలు..సుగంధ భరిత పుష్పాలు..మామిడి తోరణాలతో అలంకరించారు. సీతారాములకు అభిషేకాలు, అర్చనలు చేశారు. వాడవాడలా రామ నామ సంకీర్తనలు, అఖండ పారాయణాలు జరిపారు. పలు పట్టణాలు, గ్రామాలు, పుణ్యక్షేత్రాల్లో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- అయోధ్యలో బాలరాముడికి ప్రాణప్రతిష్ఠ
- జిల్లా వ్యాప్తంగా శ్రీరామ జపం
- ఆలయాల్లో విశేష పూజలు
- ర్యాలీలు, భజనలతో మార్మోగిన శ్రీరామనామం

చిత్తూరు రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం రామ భక్తుల శ్రీరామజపంతో జిల్లా మార్మోగింది. శ్రీరామ భక్తులు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రామాలయాలకు భక్తులు పోటెత్తారు. భజనలు, రామస్మరణలతో మునిగితేలారు. జై శ్రీరామ్ అంటూ బైక్ ర్యాలీలతో భక్తిభావాన్ని చాటుకున్నారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠను టీవీల ద్వారా వీక్షించి రామ జపం చేశారు. రాత్రి ఇంటింటా దీపాలు వెలిగించారు.

- నగరి మండలం ముడిపల్లెలోని కోదండరామలయంలో రామ పూజలు, భజనలు, అభిషేకాలు చేశారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి అధికమైంది. దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. హేరామ్..సీతారామ్ అంటూ స్వామి వారిని వేడుకున్నారు. ఈ పూజ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి రోజా పాల్గొన్నారు.
- చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని కోదండ రామస్వామి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చకులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. భజన మండలి రామకీర్తనలతో ఆలపించి...అయోధ్య రాముని స్మరించారు. పోలీస్ టైప్‌లైన్‌లో కూడా పూజలు, రామ భజనలు చేశారు. భక్తులు వాడవాడాలా శ్రీరాముడి చిత్రపటాన్ని కొలువు దీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ర్యాలీలు నిర్వహించారు.



పలమనేరులో బైక్‌ర్యాలీ చేస్తున్న రామభక్తులు

- పుంగనూరు, చౌడేపల్లె రామాలయాలు, కమలాంజనేయస్వామి ఆలయాల్లో ఉత్సవమూర్తులకు విశేషాలంకరణలు చేసి ఊరేగించారు. భక్తులు పసుపు పళ్లెంతో హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం దీపారాధన చేశారు. ఇంటి గుమ్మం ముందు దీపాలు వెలగించారు.

- పలమనేరులో సీతారాముల ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో రామయజ్ఞం పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీరాముని చిత్రపటాన్ని డప్పు వాయిద్యాల నడుమ శోభయమానంగా ఊరేగించారు. బైకు ర్యాలీ, మహిళా సంఘాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వి.కోటలోనూ శ్రీరాముడి ఊరేగింపు నిర్వహించారు.
- కుప్పం పట్టణంలోని శ్రీ రామలింగేశ్వరి ఆలయంలో కల్యాణోత్సవం నేత్రనందంగా నిర్వహించారు. అలాగే గుత్తార్లపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన అభిషేక పూజలు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రామకుప్పం మండలం కేంద్రంలో స్వామి వారి చిత్రపటాన్ని భారీ ఎత్తున్న ఊరేగించి, అన్నదానం చేశారు.

- కార్వేటినగరంలోని కోదండరాముని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి తరించారు. సాయంత్రం వరకు భజనలు, అన్నదానం కార్యక్రమాలు కొనసాగాయి.



నగరి: రామాలయంలో మంత్రి ఆర్కే రోజా



బంగారుపాళెంలో సీతారాముల గ్రామోత్సవం



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న కళాకారులు

శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించిన కాణిపాకం ఆలయ చైర్మన్, ఈఓ, సర్పంచ్



కాణిపాకంలో సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు ఊరేగింపుగా తీసుకెళుతున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన వరదరాజుల స్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయోధ్యలో సోమవారం మధ్యాహ్నం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కాణిపాకంలోని వరదరాజుల స్వామివారి ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ అవరణలో సుగంధ పుష్పాలతో అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు సీతారాముల విగ్రహాలను అలంకరించి మధ్యాహ్నం 12 గంటలకు ఊరేగింపుగా వేంచేపు చేసి, కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. వినాయకుని ప్రధాన ఆలయం నుంచి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర రెడ్డి సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు, పూజాసామగ్రి ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. అర్చకులు తొలుత హోమం చేసి, అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, రామ భజనల నడుమ శాస్త్రోక్తంగా రాములోరి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఐరాల మండల బుజ్జిరెడ్డి ఉభయకర్తలు గణేష్ ప్రసాద్ రెడ్డి, చిన్నారెడ్డి, రవి రెడ్డి, రవిచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాణిపాకం(యాదమరి): సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఓటర్ల తుది జాబితా వచ్చేసింది

- జిల్లాలో 15,58,257 ఓటర్లు
- పలమనేరు నియోజకవర్గంలో అత్యధికంగా 2,67,178 ఓటర్లు
- నగరి నియోజకవర్గంలో అత్యల్పంగా 2,01,607 ఓటర్లు
- పురుషుల కంటే మహిళలే అత్యధికం
- కలెక్టరేట్‌లో తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 2024 సంవత్సరానికి గాను ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ సోమవారం విడుదల చేశారు. గత 6 నెలలుగా జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఓటర్ల దరఖాస్తులను స్వీకరించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితాకు కసరత్తు చేపట్టారు. గత ఏడాది అక్టోబర్ 27వ తేదీన ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం చేర్పులు, మార్పులు, అభ్యంతరాల స్వీకరణ, కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తుల కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలను అనుసరిస్తూ కసరత్తును పకడ్బందీగా నిర్వహించారు. అనంతరం ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్‌లో జిల్లా తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఆ జాబితాను జిల్లాలోని అన్ని తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పంపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలు జాబితాను చూసుకునే వెసులుబాటును కల్పించారు.

పలమనేరులో అత్యధికంగా మహిళలు

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. పలమనేరు నియోజకవర్గంలో అత్యధికంగా మహిళా ఓటర్లు నమోదయ్యారు. ఆ నియోజకవర్గంలో 1,34,822 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా జీడీ నెల్లూరు నియోజకవర్గంలో 1,02,918 మంది ఓటర్లు నమోదైనట్లు తుది జాబితాలో పేర్కొన్నారు. మిగిలిన పుంగనూరు నియోజకవర్గంలో 1,21,172, నగరిలో 1,03,358, చిత్తూరులో 1,03,023, పూతలపట్టులో 1,11,577, కుప్పంలో 1,11,855 ఓటర్లు నమోదయ్యారు. 2019వ సంవత్సరంలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 7,22,534 మంది మహిళా ఓటర్లు ఉండగా, 2024 తుది జాబితా నాటికి 7,88,725 నమోదయ్యారు. గత ఐదేళ్లల్లో మహిళా ఓటర్లు 66,191 మంది పెరిగారు.



తుది ఓటర్ల జాబితా ను ప్రచురిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

జిల్లా ఓటర్లు 15,58,257

సోమవారం ప్రచురించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,58,257 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 7,65,903, మహిళలు 7,88,725, ఇతరులు 84, సర్వీస్ ఓటర్లు 3,379, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 166 మొత్తం 15,58,257 మంది ఓటర్లు ఉన్నట్లు తుది జాబితాలో పేర్కొన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో 2,38,220, నగరిలో 2,01,607, జీడీ నెల్లూరులో 2,05,123, చిత్తూరులో 2,01,741, పూతలపట్టులో 2,21,077, పలమనేరులో 2,67,178, కుప్పంలో 2,23,311 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పలమనేరులో అత్యధికంగా, నగరి నియోజకవర్గంలో అత్యల్పంగా ఓటర్లు నమోదయ్యారు.

22,862 మంది దివ్యాంగ ఓటర్లు

జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 22,862 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లు తుది జాబితాలో పేర్కొన్నారు. ఇందులో పురుషులు 13,862, మహిళలు 8,999, ఇతరులు ఇద్దరు ఉన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో 3,259, నగరిలో 3,254, జీడీ నెల్లూరులో 3,482, చిత్తూరులో 2,498 (అత్యల్పం), పూతలపట్టులో 3,707, పలమనేరులో 3,749 (అత్యధికం), కుప్పంలో 2,913 మంది దివ్యాంగ ఓటర్లు నమోదయ్యారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ షణ్మోహన్, డీఆర్వో రాజశేఖర్ ప్రచురించారు. ఈ ప్రచురణ కార్యక్రమంలో గుర్తింపు పొందిన వైఎస్సార్ సీపీ, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, ఆమ్‌ఆద్మీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. నాయకులు అడిగిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ పలు అంశాలు వెల్లడించారు.

- ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు నిరంతర ప్రక్రియ అని వెల్లడించారు.
- దొంగ ఓట్ల నమోదుపై వచ్చే వదంతులను ప్రజలు నమ్మకూడదని తెలిపారు.
- ఓటర్ల వివరాలను www. voters.eci.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు.
- పారదర్శకమైన ఓటర్ల జాబితా కసరత్తుకు గత ఆరు నెలలుగా రెవెన్యూ యంత్రాంగంతో పాటు బీఎల్వోలు విశేష కృషి చేశారన్నారు.

మారథాన్‌లో ఎస్‌ఐ సత్తా



మారథాన్‌లో ఎస్‌ఐ రామకృష్ణ

చిత్తూరు అర్బన్: ముంబయిలో ఆదివారం జరిగిన టాటా ముంబయి మారథాన్ పోటీల్లో పోలీసు శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ సత్తా చాటారు. అక్కడ 42.200 కిలో మీటర్ల దూరాన్ని 3.31 గంటల సమయంలో పూర్తి చేశారు. గతేడాది ఇదే మారథాన్‌లో 4.19 గంటల వ్యవధిలో పూర్తి చేశారు. అయితే గతంతో పోలిస్తే ఈ ఏడాది 48.21 నిమిషాల సమయాన్ని ఆదా చేశారు. బోస్టన్‌లో జరిగే మారథాన్‌లో పాల్గొనడమే తన లక్ష్యమని రామకృష్ణ చెప్పారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో
వైఎస్సార్‌సీపీలో చేరికలు



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన అలకంబాబు, రామమోహన్‌రెడ్డి

పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లెకు చెందిన తెలుగుదేశం నాయకు లు సోమవారం రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అలకం బాబు, రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అహమ్మద్‌సాహెబ్, గులామ్‌వలిషా, ఖాజాఫీర్ , వై.నారాయణ , ఎస్. అల్లాభక్షు , కె.హరీష్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి మంత్రి పెద్దిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన తెలుగుదేశం నేతలతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమైందని తెలిపారు.

బాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: ఎంతో రాజకీయ పరిజ్ఞానం, అనుభవం ఉందని చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నోరు విప్పితే అన్నీ అబద్ధాలేనని, ఆయన మాటలు విని మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు హితవు పలికారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసం ఎన్‌జేఆర్ భవనంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో మోసపూరిత మాటలు చెప్పి బాబు అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. పెన్నా నదిలో ఇసుక దోపిడీ, భూ కబ్జాలు, తెల్లరాయి అక్రమరవాణా తదితర ఆరోపణలు చేశారని, వీటిని నిరూపించాలని సవాల్ విసిరారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సైదాపురం మైనింగ్‌లో అవకతవకలు జరిగాయిని ఆరోపించి ఏమీ చేయలేకపోయారని తెలిపారు. సైదాపురంలో మైనింగ్ నడుపుతున్నది టీడీపీ సర్పంచ్ కృష్ణమరాజు కాదా..? అని ప్రశ్నించారు. జేసీఎస్ కన్వీనర్ పులిప్రసాద్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, నాయకులు ఆదిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

16 మంది నోడల్ అధికారులు నియామకం

– ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కసరత్తులో భాగంగా వివిధ శాఖల్లో పనిచేసే జిల్లా అధికారులు 16 మందిని నోడల్ అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. నోడల్ అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ ఉత్తర్వుల మేరకు..

- మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్‌కు డీఈఓ విజయేంద్రరావు, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్.
- ట్రెనింగ్ మేనేజ్‌మెంట్‌కు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి.
- మెటిరీయల్ మేనేజ్‌మెంట్‌కు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఆర్వీ షణ్ముగం.
- ట్రాన్స్‌ఫోర్ట్ ప్రక్రియకు డీటీసీ నిరంజన్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి.
- కంప్యూటరైజేషన్, సైబర్‌సెక్యూరిటీ, ఐటీకి సంబంధించి కలెక్టరేట్ ఎన్ఐసీ డీఐఓ సుధాకర్.
- స్వీప్ యాక్టివిటీకి డీఆర్‌డీఏ పీడీ తులసి, మెప్మా పీడీ రాధమ్మ.
- లా అండ్ ఆర్డర్, వీఎం, సెక్యూరిటీ ప్లాన్‌కు కలెక్టరేట్ మెజిస్ట్రీయల్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు.
- ఈవీఎం మేనేజ్‌మెంట్‌కు ఫారెస్ట్‌సెటిల్‌మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్‌నాయుడు, డ్వామా పీడీ గంగాభవాని
- మోడల్ కోడ్ కండక్ట్‌కు అగ్రికల్చర్ జేడీ మురళీకృష్ణ, డీపీఓ లక్ష్మి.
- ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్‌కు జిల్లా ఆడిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి.
- బ్యాలెట్‌పేపర్స్, పోస్టల్ బ్యాలెట్‌కు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటకృష్ణారెడ్డి.
- మీడియా నోడల్ ఆఫీసర్‌గా ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ.
- కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ ఆఫీసర్‌గా డీఎల్‌డీఓ రవికుమార్.
- ఎలక్ట్రోరల్స్‌కు కలెక్టరేట్ ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా.
- కంప్లెయింట్స్ రిడ్రెసల్, ఓటర్ హెల్ప్‌లైన్‌కు పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్‌రెడ్డి, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు.
- అబ్జర్వర్స్, ఏఎంఎఫ్, బీఎంఎఫ్, రిపార్టుల నోడల్ ఆఫీసర్లుగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఓ సాంబశివ ను నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పల్లె వాకిట అభివృద్ధి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం.. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పారిశుద్ధ్యం మెరుగు తదితర మౌలిక వసతుల కల్పనతో పాటు ఇంటి ముంగిటకే వైద్యం, సంక్షేమ పథకాలు, పాఠశాలల అభివృద్ధి, విద్యుత్ సమస్యల పరిష్కారం తదితర అభివృద్ధి పనులతో పల్లెల రూపురేఖలు మారుతున్నాయి. మంగళవారం జెడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి పనులపై ప్రత్యేక కథనం.



- వైఎస్సార్‌సీపీ పాలనలో జోరుగా అభివృద్ధి పనులు
- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం
- పలు శాఖలపై చర్చ

- రబీ సీజన్‌లో రూ.1135.18 కోట్లు రైతులకు మంజూరు చేయగా, వ్యవసాయేతర రుణాలు రూ.477.81 కోట్లు ఇచ్చారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా 18830.55 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందజేశారు. జిల్లాలో 4,50,410 మంది రైతులకు రూ.366.29 కోట్ల వైఎస్సార్ రైతు భరోసా నిధులు, పీఎం కిసాన్ కింద 5,23,028 మంది అన్నదాతల కుటుంబాలకు రూ.207.96 కోట్లు వారి ఖాతాల నందు జమ చేశారు.
- ఖరీఫ్ సీజన్‌లో రూ.6846.7 కోట్లు వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర రుణాలు రూ.3,336.9 మంజూరు చేశారు.
- బైజుస్ కింద 38,338 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు, 6,592 మంది ఉపాధ్యాయులకు మొత్తం 44,930 ట్యాబ్‌లను ఉచితంగా అందించారు.

-మన బడి నాడు–నేడు పథకం ద్వారా మొదటి విడతలో జిల్లాలో 743 పాఠశాలల్లో రూ.144 కోట్లతో ఆధునికీకరించారు. రెండో విడతలో 1180 పాఠశాలలు, 30 జూనియర్ కళాశాలల ఆధునికీకరణకు రూ.166.44 కోట్లు ఖర్చు చేశారు

- జగనన్న విద్యా కానుక కింద జిల్లాలో 1,67,154 మంది విద్యార్థులకు రూ.41.8 కోట్లు వ్యయంతో కిట్లు అందజేశారు.
- ప్రభుత్వాస్పత్రుల్లో 19,518 కాన్పులు జరిగాయి. జెఎస్‌వై పథకం కింద 16,980 మంది రూ.13.65 కోట్ల లబ్ధి పొందారు. 14,569 మంది బాలింతలు తల్లీబిడ్డ సేవలను వినియోగించుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా 1,36,777 మంది వైద్య సేవలు పొందారు. ఇందుకోసం రూ.266.66 కోట్లు వ్యయం చేశారు. జిల్లాలో 30,431 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. 104 వాహనాల సేవలను 14.58 లక్షల మంది పొందారు. 108 సేవలను 66,963 మంది పొందారు.
- నాబార్డ్, ఎంపీ నిధులు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, జలజీవన్ మిషన్ పథకాలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా పనులు చేపట్టారు. మొత్తం 13,977 పనులకు రూ.196.67 కోట్లు ఖర్చు చేశారు. వీటితో పాటు జిల్లాలో 3 రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.2144.50 కోట్లతో పరిపాలన అనుమతులు రాగా పనులు జరుగుతున్నాయి.
- గృహనిర్మాణశాఖలో 1,40,395 ఇళ్లు పునాదులు, ఆ పై స్థాయిలో నిర్మాణంలో ఉన్నాయి. ఇందుకు గాను రూ.1860.12 కోట్లు వ్యయం చేశారు. రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉంది. 847 లే అవుట్లలో రూ.102 కోట్ల వ్యయంతో నీటి సౌకర్యం కల్పించారు.
- జిల్లాలో రూ.39.06 కోట్ల వ్యయంతో 14 నూతన సబ్‌స్టేషన్లను నిర్మించారు.
- పంచాయతీరాజ్ పరిధిలో 583 సచివాలయాలు నిర్మాణానికి రూ.217 కోట్లు, 546 రైతు భరోసా కేంద్రాలకు రూ.119.02 కోట్లు, 265 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.55.12 కోట్లు వ్యయం చేశారు.
- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 5,67,942 మందికి రూ.1350.14 కోట్లు పింఛన్ ఇచ్చారు. వైఎస్సార్ సున్నావడ్డీ కింద 58,775 స్వయం సహాయక సంఘాలకు రూ.83.60 కోట్లు విడుదల చేశారు. జగనన్న తోడు కింద 1.09 లక్షల మంది చిరువ్యాపారులకు రూ.109.70 కోట్లు మంజూరు చేశారు. స్త్రీ నిధి కింద 56,012 స్వయం సహాయక సభ్యులకు రూ.343.60 కోట్లు రుణం ఇచ్చారు.
- జిల్లా నీటి యజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద 2.93 లక్షల కుటుంబాలకు 150.02 లక్షల పనిదినాలు కల్పించి, రూ.385.48 కోట్లు వేతన రూపంలో చెల్లించారు. మిషన్ వాత్సల్య పథకం కింద కోవిడ్–19 అనాథ పిల్లలకు 760 మందికి రూ.1.78 కోట్లు ఖర్చు చేశారు.
- వసతి గృహాల నిర్వహణకు రూ.5.45 కోట్లు నిధులు మంజూరు చేశారు.

పారదర్శక పాలన



అభివృద్ధి పాలన అందించడానికి కృషి చేస్తున్నాం. పల్లెల్లో అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జగనన్న ఆరోగ్య సురక్ష వంటి విన్నూత పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

ఏర్పాట్లు పూర్తి



జెడ్పీ సర్వ సభ్య సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. సభ్యులకు ముందస్తుగా సమాచారం, అజెండా పుస్తకాలను అందజేశాం. తిరుపతి, అన్నమయ్య జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందస్తుగా సమాచారం చేరవేశాం. జిల్లాశాఖల హెచ్‌ఓడీలు తప్పనిసరిగా సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలి. – ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ

వైఎస్సార్‌సీపీకి బీసీలే వెన్నెముక



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీకి బీసీలే వెన్నెముక అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ అన్నారు. చిత్తూరు నగరం గంగినేని పార్కు ఆవరణలో మరుదు పాండియార్స్ విగ్రహ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వారు విగ్రహ నిర్మాణానికి సహకరించారని, ఇందుకు సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు ఎప్పుడు అండగా ఉంటుందని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ జె అరుణ, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నాయకులు గుణశేఖరన్, సుగుణాంబాల్, జ్ఞానజగదీష్, బుల్లెట్ అప్పు, బాలకృష్ణ, మరుకప్ప మురళి, అలీ, కుట్టి, హరిణిరెడ్డి, లక్ష్మణన్, రవి, హేము, కిరణ్‌రాయల్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రారంభోత్సవం



పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: మండలంలోని బీఎన్‌ఆర్‌పేట చెక్ పోస్టులో సోమ వారం విజయానందరెడ్డి, జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, నాయకులు వచ్చన్నపల్లి పాండియన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ముందుగా కార్యాలయ ఆవరణలో పార్టీ జెండా ఆవిష్కరించారు. విజయానందరెడ్డికి డప్పు వాయి ద్యాలతో నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాలు తీసుకుంటూ సమస్యలను పరిష్కరించేలా చూస్తానని చెప్పా రు. సమష్టిగా కృషి చేసి పార్టీని బలోపేతం చేద్దామని, మళ్లీ జగనన్నను గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అమరనాథ్‌రెడ్డి, త్యాగరాజులు, హంస, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు సంపత్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చనకు మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఫిబ్రవరి 28వ తేది నుంచి జరగనున్న లక్ష కుంకుమార్చన కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆహ్వానించారు. సోమవారం వారు మంత్రిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలన్నారు. లక్ష కుంకుమార్చన ఏర్పాట్లు, వసతులతోపాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని చైర్మన్, ఈఓలను ఆదేశించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

గ్రామీణాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా పరిషత్ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత బడ్జెట్‌ను చైర్మన్ శ్రీనివాసులు సభ్యులకు తెలిపారు. సోమవారం సాయంత్రం జెడ్పీ కార్యాలయంలో 1,7 స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. అంచనా ఆదాయం రూ.4,133.08 కోట్లు, అంచనా వ్యయం రూ.4,039.44 కోట్లతో ప్రతిపాదించగా సభ్యులు వాటిని ఆమోదించారు. వీటిని మంగళవారం జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందాల్సి ఉండగా, పాలక వర్గానికి అది లాంఛనమే. ఎక్కువగా మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదిత బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. గ్రాంట్లను వినియోగించుకుని పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులను మొదలుపెడితే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లాకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం కుప్పానికి హంద్రీ–నీవా ద్వారా నీటిని విడుదల చేశారన్నారు. గ్రామీణనీటి సరఫరాకు మంజూరైన పనుల ప్రగతిని ఎస్ఈ విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేల పక్కన సర్వీస్ రోడ్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను చైర్మన్ ఆదేశించారు. కార్యక్రమంలో సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య, ఐసీడీఎస్ స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ భారతి, సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రమీలమ్మ, సుకుమార్, హరిత, పార్వతి పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

కుప్పంరూరల్: స్నేహితులతో కలిసి సరదాగా తెప్పపై చెరువులో విహారానికి వెళ్లి, గల్లంతైన సామగుట్టపల్లెకు చెందిన సంజయ్ (27) మృతదేహం సోమవారం లభ్యమైంది. అగ్నిమాపక సిబ్బంది, పోలీసు యంత్రాంగం రెండు రోజులుగా సంజయ్ మృతదేహం కోసం తీవ్రంగా గాలించారు. ఫలితం లేకపోయింది. అయితే సోమవారం అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక గాలి యంత్రాలతో చెరువు నీటిలోకి గాలిని పంపి, వెతుకులాట ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు మృతుడు సంజయ్ శవం పైకి తేలింది. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మృతుడు సంజయ్ అవివాహితుడు. స్నేహితులే సంజయ్‌ని హతమార్చి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కుప్పం సీఐ శ్రీధర్ తెలిపారు. మృతదేహం వెలికి తీతలో ఫైర్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, నరేష్, రామమూర్తి, కృష్ణయ్య, మణి, బాలకృష్ణ పాల్గొన్నారు.

శుభగడియాల్లో 19 ప్రసవాలు


చిత్తూరు రూరల్: జిల్లాలోని 11 ప్రభుత్వాస్పత్రుల పరిధిలో సోమవారం 19 ప్రసవాలు జరిగాయి. ఈ ప్రసవాల్లో 12 మంది ఆడపిల్లలు, ఏడుగురు మగ పిల్లలు జన్మించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రసవాల సంఖ్య రెండు మాత్రమే నమోదైంది. ఆపై 11 మంది పురుడుపోసుకున్నారు. సాయంత్రం నుంచి 6 నుంచి 8 గంటల వరకు 6 ప్రసవాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మధ్యాహ్నం 12.20 నుంచి 12.40 నిమిషాల మధ్యలో అంటే అభిజిత్ ముహూర్తంలో పిల్లలు పుట్టాలని చాలా మంది కోరుకుంటారని, బాలరాముడి ప్రతిష్ట ముహూర్తం చాలా శ్రేష్టమైనదని వేదపండితులు చెబుతున్నారు. ఈ శుభ ముహూర్తం మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఉందని, ఈసమయంలో పుట్టిన శిశువులు రాణిస్తారని వారు పేర్కొన్నారు.

సీఎంను కలసిన నారాయణస్వామి



తాడేపల్లెలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసిన ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఆయన కుమార్తె కృపాలక్ష్మి.

సర్వేల పేరుతో 'పచ్చ' మాయ



టీడీపీ నుంచి గ్రామస్తుల ఫోన్లకు వచ్చిన సందేశాలు

గంగాధర నెల్లూరు: సర్వేల పేరుతో జీడీ నెల్లూరు మండలం పెద్దకాలువ పంచాయతీలో టీడీపీకి చెందిన కొంత మంది ప్రజలను మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పెద్ద కాలవ పంచాయతీలో టీడీపీ సభ్యులు సర్వేల పేరుతో గ్రామంలోని ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నారు. వివరాలు చెప్పకుంటే ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తామని బెదిరించారు. టీడీపీకి చెందిన వెబ్‌సైట్‌లో న మోదు చేసి ప్రజల ఫోన్ నంబర్లకు పార్టీ సభ్యత్వం నమోదు చేసినట్లు మెసేజ్ పంపారు. ఈ విషయమై వారు సర్పంచ్ ఏకాంబరానికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తామంతా వైఎస్సార్ సీపీకి చెందిన వారమని, ఇలాంటి మాయ మాటలకు, బెదిరింపులకు లొంగమని చెప్పారు. దీనిపై స్పందించిన సర్పంచ్ ఏకాంబరం మాట్లాడుతూ గ్రామంలో అధిక శాతం మంది ప్రజలు సీఎం జగనన్న పక్కన ఉన్నారని, అది చూసి ఓర్వలేక టీడీపీ వారు ఇలా మోసం చేసి సభ్యత్వం పేరుతో ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నారని, ఇలా ఎవరైనా మరోసారి గ్రామాల్లోని ఇళ్ల వద్దకు వస్తే ప్రజలు వెంటనే వలంటర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలని, వివరాలు సేకరించిన వారిని గుర్తించి పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేస్తే, తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

బాబు కోసమే ఎల్లో మీడియా ఆరాటం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: ఎన్నికలు సమీపిస్తున్నందున ఎల్లో మీడియా ఆగడాలు ఎక్కువయ్యాయని వైఎస్సార్‌సీపీనేతలు సో మవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు, ఎంపీపీ రామ్మూర్తి ఆధ్వర్యంలో ఆంధ్రజ్యోతి కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజలను తప్పుతోవ పట్టించడమే లక్ష్యంగా ఇష్టమొచ్చినట్లు అసత్య కథనాలను ప్రచురిస్తూ ఎలాగైనా సరే చంద్రబాబును అధికారం చేజిక్కించాలనే కుట్ర తారా స్థాయికి చేరుతోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఎల్లో మీడియా ఏబీఎన్, ఆంధ్ర జ్యోతి, ఈనాడు, టీవీ 5 అసత్య కథనాలను ప్రచురించడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధిని రాష్ట్ర స్థాయిలో నేడు పులివెందల తరువాత పుంగనూరు అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక పనిగట్టుకుని తప్పుడు రాతలు రాయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై ఆంధ్రజ్యోతి పత్రికకు నిప్పు పెట్టారు. అసత్య కథనాలు ప్రచురిస్తున్నపత్రికను బహిష్కరిస్తున్నట్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, జంగమ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.నాగరాజ, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్సీసెల్ మండల కన్వీనర్ గోవిందు, డీసీసీబీ డైరెక్టర్ రమేష్‌నాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర డైరెక్టర్ మంజునాథ, ఎంపీటీసీ సభ్యులు శ్రీరాములు, లక్ష్మీనర్సయ్య, సర్పంచులు ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.